

గోదావరి నది వద్ద ఐఆర్ బోట్లతో ట్రయల్స్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

## ఐఆర్ బోట్లతో ట్రయల్స్

ఏటూరునాగారం, డిసెంబర్ 6 : తుఫాన్ ప్రభావం వల్ల సంభవించే వరద ఉధృతిని ఎదుర్కొని ప్రజలను కాపాడే చర్యల్లో భాగంగా బుధవారం ఎస్పీ గౌష్‌ఆలం ఆదేశాల మేరకు పోలీసులు ఐఆర్ బోట్లతో ట్రయల్స్ నిర్వహించారు. ఇందులో ఏటూరునాగారం సీఐ, వాజేడు ఎస్సై సిబ్బందితో కలిసి వాజేడు మండలం ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి నది వద్ద ట్రయల్స్ చేపట్టారు. ప్రజల ప్రాణాలను వరదల నుంచి కాపాడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను క్షుణ్ణంగా పరిశీలించుకున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాసరావు

## అంబేద్కర్ జీవితం అనుసరణీయం

### సింగరేణి ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 6: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం అనుసరణీయమని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కృష్ణ కాలనీలోని అంబేద్కర్ క్రీడా మైదానంలోని విగ్రహానికి జీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి తన జీవితాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాల కోసం అంకితం చేసిన మహనీయుడన్నారు. అనేక దుర్భర పరిస్థితుల్లో అంబేద్కర్ బాల్యం గడించిందని, పట్టుదలతో అప్పటి సహజ పరిస్థితులకు ఎదురొడ్డి భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు మనందరం కృషి చేయాలని జీఎం కోరారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం వెంకటయ్య, ఏరియా అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీ వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వీ రావు, ప్రెసిడెంట్ భూక్యా మోహన్, బ్రాంచ్ సెక్రటరీ హేమానాయక్ పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన డీఈవో

వెంకటాపూర్, డిసెంబర్ 6 : మండలంలోని నర్సాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డీఈవో పాణిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరును, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు మంజులాఠాగూర్, మధుసూదన్, శ్రీనివాసాచారి, జవహర్‌నాయక్, జగదీశ్ ఉన్నారు.



విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో పాణిని

# సింగరేణిలో యువతకు ఉపాధి కల్పించాం

- టీబీజీకేఎస్‌లో యువ సారథ్యానికి అవకాశం ఇస్తాం
- కారుణ్య నియామకాలను పునరుద్ధరించిన ఘనత కేసీఆర్‌దే
- ఆయనతోనే కార్మికుల జీవితాల్లో వెలుగులు
- ఎమ్మెల్సీ కవితతో టీబీజీకేఎస్ నేతల భేటీ
- సింగరేణి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలతో చర్చ



ఎమ్మెల్సీ కవితతో టీబీజీకేఎస్ నేతలు వెంకట్రావ్, రాజిరెడ్డి, మల్లయ్య

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించామని, అదే స్ఫూర్తితో నాయకత్వ సారథ్యంలోనూ అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య బుధవారం హైదరాబాద్‌లో కవితను కలిసి అనుసరించాల్సి వ్యూహాలు, సన్నద్ధతపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, ఉద్యోగుల్లో యువత 50 శాతం ఉన్నారని, తమ యూనియన్‌లో యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అంతేకాకుండా 66శాతం వరకు నాయకత్వ బాధ్యతల్లో అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. 1998లో ఆగిపోయిన కారుణ్య నియామకాలను 2018లో కేసీఆర్ తిరిగి పునరుద్ధరించి వేలాది మందిని నియమించారని పేర్కొన్నారు. జాతీయ సంఘాల కారణంగా 1998 వరకు కారుణ్య నియామకాలకు గండిపడిందన్నారు. కోలిండియా సంస్థలో సైతం లేని విధంగా కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సంస్థను లాభాల బాట పట్టించడానికి, సంస్థ ఎదుగుదలకు, కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ఎనలేని కృషి చేశారని తెలిపారు. సింగరేణిని కష్టాల నుంచి కాపాడిన బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌ను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్మికుల పక్షాన నిలబడే ఏకైక సంఘం టీబీజీకేఎస్ అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ దాదాపు 20వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చి యువతకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణి సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాలను పంచారని చెప్పారు. 1999-2000 ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో కార్మికులకు కేవలం 10శాతం వాటా ఉండేదని, తెలంగాణ ఏర్పడినప్పుడు 18శాతంగా ఉండేదని, దాన్ని కేసీఆర్ 32 శాతానికి పెంచారని వివరించారు. తద్వారా కార్మికుల కుటుంబాలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం లభించిందని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సును 80 నుంచి 81కి పెంచామని, గతంలో సమ్మె చేస్తే సంస్థ జీతం ఇచ్చేది కాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో 35రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న వారికి రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పూర్తి జీతం ఇచ్చారని తెలిపారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యం కల్పించడం, క్వార్టర్స్‌లో నివసించే వారు బేసిక్‌లో 1శాతం సంస్థకు చెల్లించాలన్న నిబంధనను కేసీఆర్ రద్దు చేశారని, డిపెండెంట్ ఉద్యోగం వద్దనుకుంటే ఆ కుటుంబానికి రూ.25లక్షలు చెల్లించాలన్న నిర్ణయం, కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ అయితే వేతన రక్షణ కల్పించడం, సొంత నిర్మించుకునే వారికి రూ.10లక్షల వరకు సంస్థనే వడ్డీ భరించడం, ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థల్లో చదువుకునే కార్మికుల పిల్లలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మకమైన కార్మిక సంక్షేమ నిర్ణయాలను కేసీఆర్ తీసుకున్నారని కవిత వివరించారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఏటూరునాగారం క్రీడాకారుల ఎంపిక

ఏటూరునాగారం, డిసెంబర్ 6 : రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి బుధవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఇటీవల హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 ఇయర్స్ హ్యాండ్ బాల్ క్రీడల ఎంపికలో క్రీడాకారులు జీ సాయికిరణ్, పీ రాజేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో వారు ఈనెల 8,9 తేదీల్లో మంచిర్యాల జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు. కాగా, వీరిని ములుగు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మదన్‌మోహన్‌తో పాటు, పీడీ, పీఈటీలు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ కుమారస్వామి

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

చిట్యాల, డిసెంబర్ 6 : వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని గిద్దెముత్తారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులను సమస్య లు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మరో రెండు మూడు రోజులపాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు టార్పాలిన్లు ఇవ్వడంతో పాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే దూత్‌పల్లి, ఒడితల, నవాబుపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి(జడ్పీ సీఈవో) విజయలక్ష్మి సందర్శించారు. రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి కార్యనిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఆర్ఐ రాజు, ఎంపీవో రామకృష్ణ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



గిద్దెముత్తారం కొనుగోలు కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## హోమ్‌గార్డుల సేవలు అభినందనీయం

### ములుగు ఎస్పీ గౌష్‌ఆలం

ములుగు, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ) : పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే హోంగార్డుల సేవలు ఎంతో అభినందనీయమని ఎస్పీ గౌష్ఆలం అన్నారు. హోమ్ గార్డ్స్ రైజింగ్ డే వేడుకలను బుధవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన హోమ్‌గార్డులను ఎస్పీ సన్మానించి జ్ఞాపికలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించే హోంగార్డుల సేవలు వెలకట్టలేనివన్నారు. శాంతి భద్రతలతో పాటు వరదలు, బందోబస్తు సమయాల్లో కీలకంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హోమ్‌గార్డు ఆర్ఐ వెంకటనారాయణ, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.



హోమ్‌గార్డులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ గౌష్‌ఆలం